గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న లారీలు సీజ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను బాపులపాడు రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. బాపులపాడు మండలం పెరికీడు వద్ద జాతీయ రహదారి వద్ద తహసీల్దార్ నాగభూషణం, హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఈ లారీలను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని తహసీల్దార్ తెలిపారు. మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాపై నిరంతం నిఘా ఉంటుందని చెప్పారు.

శ్వాసకోశ వ్యాధులపై అవగాహన

ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ప్రపంచ న్యుమోనియా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రజ్ఞ చెస్ట్ హాస్పిటల్‌లో శ్వాసకోశ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధులపై డాక్టర్ కృపాసాగర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు నెల్లి రాంబాబు, నల్లా శ్రీనివాస్, హసన్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరు



యనమలకుదురులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న పెనమలూరులో ధర్నా చేయనున్నామని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి తెలిపారు. ఈ మేరకు మండల గ్రామాల్లో మంగళవారం ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజాపోరులో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై పెనుభారం మోపారని ఆరోపించారు. వీధివీధిలో మద్యం షాపులు, బెల్టుషాపులు వెలిశాయని విమర్శించారు. వరద బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయలేదని, నష్టపరిహారం అందలేదన్నారు. రోడ్లు అభివృద్ధి చేయలేదని, విశాఖ ఉక్కు ప్రైవేటు పరం చేయటానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సీపీఎం నేతలు షేక్ కాశిం, షేక్ మస్తాన్‌వలి, పలువురు నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను తగ్గించాలి

గన్నవరం: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను, విద్యుత్ బిల్లుల భారాలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన ప్రజాపోరులో భాగంగా ఆ పార్టీ నేతలు మంగళవారం పట్టణంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. నెల రోజులుగా కూరగాయలు, నిత్యావసరాలు, వంటనూనె ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ చార్జీల పేరుతో రూ. 6,072 కోట్ల భారం వేశారని మండిపడ్డారు. కొత్తగా మరో రూ.11,826 కోట్లు విద్యుత్ భారాలు మోపేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం బెల్టుషాపులు అదుపు చేయడం లేదన్నారు. ఈ సమస్యలపై 14న ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు సూరగాని సాంబశివరావు, ఏసుదాసు, తాతబ్బాయి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న మండల కేంద్రంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు వివరిస్తూ తేలప్రోలులో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి, మాగంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వం ప్రజలపై ధరల భారం మోపుతుందని సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్ అన్నారు. సీపీఎం పిలుపు మేరకు ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని 15వ వార్డులో ప్రజా పోరు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుగాని వీరయ్య, యడ్లపల్లి వెంకయ్య, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెనమలూరు: పోరంకి సీతాపురంకాలనీలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. బందరు రోడ్డు నుంచి సీతాపురంకాలనీ వరకు రెండు బిట్లుగా రోడ్డు నిర్మాణం చేస్తారు. ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ నిధులతో వివిధ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. మున్సిపాలిటీ కమిషనర్ భవానిప్రసాద్, నాయకుడు అనుమోలు ప్రభాకరరావు, సాయిబాబా గుడి చైర్మన్ మున్నంగి అర్జున్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని సాయిపురం గ్రామానికి అనుసంధానమైన ఉయ్యూరు- సాయిపురం, ముదునూరు- సాయిపురం మధ్య రూ.2.80 కోట్లతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధికి మంగళవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ షేక్ జాన్‌బాషా, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు వెనిగళ్ల వెంకట కుటుంబరావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

గన్నవరం: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మెకానికల్ విభాగం సీనియర్ లెక్చరర్ వడ్డేశ్వరపు ఎలీషా దేవసహాయం అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఎలీషా దేవసహాయంను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ఏ.పద్మావతితో పాటు అధ్యాపక బృందం అభినందించారు. ఉద్యోగ నిర్వాహణలో ఎలీషా పనితీరును ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందజేయడం హర్షణీయమన్నారు. పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కూడా ఆయనకు అభినందనలు తెలియజేశారు.

షేక్ ఇమాం దంపతులకు సత్కారం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ ఇమాంకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో అవార్డు అందజేయగా మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇమాంను, ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానాను ఘనంగా సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని ఇమాం పేర్కొన్నారు. ఉపాధ్యాయులు జయశ్రీ, విజయలక్ష్మి, సునీత, కరుణ, కౌసర్, దీపిక పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై సదస్సు

గన్నవరం రూరల్: గోపవరపుగూడెం గ్రామంలో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై స్థానిక ఎంపీపీ పాఠశాలలో సదస్సు నిర్వహించారు. సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఫౌండేషన్ ప్రతినిధులు దివ్య, ప్రభాకర్, స్వరూపరాణి, రంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి, మండవ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: గన్నవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో కిశోర వికాసం, పిల్లల దత్తతపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. జిల్లా ప్రొటక్షన్ (దత్తత) అధికారివి.ప్రశాంత్‌మాట్లాడారు. హెల్ప్‌లైన్ నంబరు 1098కు సమాచారం ఇచ్చి బాధితులను కాపాడవచ్చని తెలిపారు. సూపర్‌వైజర్ పద్మాదేవి, సోషల్ వర్కర్ ప్రేమలత, సత్య, హెచ్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలమయ్యారని సీపీఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. జగన్నాథపురం, క్రిస్టియన్‌పేట శాఖల ఆధ్వర్యంలో జగన్నాథపురంలో సీపీఎం మండల 6వ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఐద్వా సీనియర్ నేత చిక్కవరపు నాగేశ్వరమ్మ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. నరసింహారావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయన్నారు. సమస్యల పరిష్కారానికై పోరాటం ఒక్కటే శరణ్యమన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు ఇతర నేతలు పాల్గొన్నారు. పార్టీ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల కార్యదర్శిగా తాడంకి నరేష్ ఎన్నిక కాగా, సభ్యులుగా జి.కుమారి, వి.శివశంకర్, వి.జాన్‌మోజేస్, జె.రవి, సిహెచ్ శ్రీహరి, వి.మరియదాసు, ఎం.చంటిబాబు, పి.దుర్గాప్రసాద్, వి.రమేష్, వి.సునీత ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం

గన్నవరం: ఉపాధ్యాయ, విద్య రంగ సమస్యలపై రాష్ట్రోపాధ్యాయ సంఘం రాజీలేని పోరాటాలు సాగిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని దావాజిగూడెం, రాజీవ్‌నగర్, చింతలపేట, చెంచులకాలనీ, రాయ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొరగా నిధులు కేటాయించిందన్నారు. పాఠశాల విద్యకు కేటాయించిన రూ. 29,909 కోట్లు విద్యారంగ ప్రగతికి ఏమాత్రం సరిపడవని చెప్పారు. మొత్తం బడ్జెట్‌లో విద్యకు ప్రభుత్వం పది శాతం కూడా కేటాయింపులు చేయకపోవడం బడుగు, బలహీన వర్గాల పిల్లలపై సవతితల్లి ప్రేమను తలపిస్తుందన్నారు. 12వ వేతన సవరణకు, డీఏ బకాయిలు, అరియర్లు, పెండింగ్ పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, పాత పెన్షన్ల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. పాలకులు వైఖరిని మార్చుకోకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు దోవర్ సురేష్, మండల అధ్యక్షుడు మొత్రు ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రావెళ్ల అనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు నాయీ బ్రాహ్మణుల వినతి

రామవరప్పాడు: నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నగరంలో ఓ ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను సంఘ నాయకులు కలిసి విన్నవించారు. ఏళ్ల తరబడి నాయీ బ్రాహ్మణులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, పరిష్కారం కాని తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రచయిత, కాలమిస్టు స్టేట్ కన్వీనర్ సూర్యపల్లి శ్రీనివాస్, ఏపీ చాప్టర్ నవసమాజ చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, నాయీబ్రాహ్మణ జన సేవాసమితి జిల్లా కన్వీనర్ తెన్నేటి సోమశేఖర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

పెనమలూరు: పెనమలూరు, పోరంకి గ్రామాలలో నిరుపేదలు, చెంచు కుటుంబాలకు నిత్యావ సరుకులను తహసీల్దార్ గోపాలకృష్ణ అందజేశారు. నెస్లే ఇండియా, జేసీఐ ఇండియా ఆధ్వర్యంలో 100 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ పేదలకు సేవలు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని సూచించారు. నెస్లే మేనేజర్ వసీం అహ్మద్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఇటీవల వచ్చిన వరదలు, వర్షాల కారణంగా తమ సంస్థ పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కామిశెట్టి ప్రమోద్‌కుమార్, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, తోటకూర ఉదయ్‌భాస్కర్, షేక్ సైదులు, కిలారు శ్రీనివాసరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందజేత

కంకిపాడు: భగవద్గీతతో మనో వికాసం, విద్యాభివృద్ధి సాధ్యమవుతాయని లయన్స్ ప్రతినిధులు సూచించారు. టీటీడీ విజయవాడ యూనిట్ అందజేసిన భగవద్గీత పుస్తకాలను మంగళవారం కంకిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మద్దుల గోవిందరావు మాట్లాడుతూ జ్ఞాన వృద్ధికి భగవద్గీత ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పిళ్లా ఆంజనేయులు, మద్దుల యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో ట్రాక్టర్ చోరీ ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన గద్దె పాంబశివరావుకు కానూరు శ్మశానవాటిక వద్ద స్థలం ఉంది. ఆస్థలంలో ఇండస్ ఇండ్ బ్యాంకు అద్దెకు తీసుకొని రికవరీ చేసిన వాహనాలు ఉంచుతున్నారు. స్థలానికి వాచ్‌మెన్‌గా రవికుమార్ అనే వ్యక్తి ఉంటున్నాడు. అయితే బ్యాంకు అధికారులు స్థలంలో ఉన్న వాహనాలను ఇటీవల తనిఖీ చేయగా ఒక ట్రాక్టర్ కనపడలేదు. దీంతో సీసీ కెమెరా పరిశీలించగా ఆగస్టు 24వ తేదీన వాచ్‌మెన్ మిత్రుడు పుప్పాల విజయ్‌దుర్గాప్రసాద్ రూ.7 లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను దొంగిలించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. దీంతో ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై ముగ్గురు దాడి

పెనమలూరు: కానూరులో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కామయ్యతోపు రాజశ్రీ టవర్స్‌లో గత 10 సంవత్సరాలుగా వాచ్‌మెన్‌గా అరకట్ల బంగారు పని చేస్తున్నాడు. అతని స్వగ్రామం అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం, రేవుపోలవరం గ్రామం. కాగా బంగారు కామయ్యతోపులో సినిమాహాల్ సమీపంలో వైన్‌షాపు వద్ద ఉన్న సమయంలో కారు అతివేగంగా వచ్చి భయభ్రాంతులకు గురి చేసింది. దీంతో కారులో ఉన్న వ్యక్తులను ఉద్దేశించి కారు నిదానంగా నడపమని బంగారు అన్నాడు. దీంతో కారులో ఉన్న గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కారు ఆపి బంగారుపై దాడి చేశారు. ఈ ఘటనలో బంగారు గాయపడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గన్నవరం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై గన్నవరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని బీబీగూడెం గ్రామానికి చెందిన కాట్రు రాజేష్(37) టాటా స్టీల్ యార్డులో ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ కలహాలు, అనారోగ్య కారణాల రీత్యా ఈ నెల 10న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆతనిని కుటుంబ సభ్యులు గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి రాజేష్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు.

పీహెచ్‌సీ ఆవరణలో గంజాయి బ్యాచ్ వీరంగం

పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం రాత్రి గంజాయి బ్యాచ్ ఘర్షణపడి వీరంగం సృష్టించారు. దీంతో ఆస్పత్రిలో విధుల్లో ఉన్న మహిళా సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. పెనమలూరు గ్రామంలో ఇరువర్గాలకు చెందిన యువకులు గంజాయి, మద్యం సేవించి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఓ యువకుడికి గాయాలవటంతో చికిత్సకై రాత్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రత్యర్థులు ఆరోగ్య కేంద్రం వద్దకు వచ్చి మరలా గొడవపడ్డారు. అరుపులు కేకలతో వీరంగం సృష్టించారు. ఆస్పత్రిలో విధుల్లో ఉన్న సిబ్బంది యువకుల వీరంగానికి తీవ్రంగా కలవరపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి యువకులను అదుపులోకి తీసుకున్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్, తాగుబోతులు తరచుగా గ్రామాలలో గొడవలు పడుతుండటంతో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాలలో గ్రామాలలో భద్రత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పారిశుద్ధ్య సిబ్బందిచే పూడికతీయించారు. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయిన్లతో పాటు, ప్రధాన రహదారి, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లలో మంగళవారం పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్తను ఎప్పటి కప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నామన్నారు. గ్రామంలో రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రవిబాబు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా బాపులపాడు మండలం రేమల్లే జెడ్పీ హైస్కూల్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు వెలమర్తి రవిబాబు ఎన్నికయ్యారు. గన్నవరంలో మంగళవారం జరిగిన యూటీఎఫ్ జిల్లా మహాసభల్లో ఎన్నుకున్నట్లుగా ఆయన విలేకరులకు తెలిపారు. తనపై అపార నమ్మకంతో వరుసగా రెండోసారి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయ వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తానని, అందరూ సహకరించాలని రవిబాబు పేర్కొన్నారు.

పెరికీడులో ప్రత్యక్షమైన అఘోరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో మహిళా అఘోరి నాగసాధు మంగళవారం ఆకస్మికంగా ప్రత్యక్షమైంది. జాతీయ రహదారిపై పెరికీడు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆమె కారులో నిద్రకు ఉపక్రమించటంతో ఆ మార్గాన వెళుతున్న ప్రయాణికులు, స్థానికులు గుర్తించారు. కొద్దిసేపటికే గుంపులు, గుంపులుగా జనం చేరటంతో ఆమె కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు.